GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 18-08-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# చందాలు వసూలు చేయడంలో వేగం..!
# వైద్యం అందించడంలో నిర్లక్ష్యం..!

చందాలు కోట్లలో
వైద్యం మాత్రం కరువా?

క.రా.బీ.ని. ESIC సమాజిక భద్రత

## వైద్యం దానం కాదు.. కార్మికుల హక్కు!

- ఈఎస్ఐ చందా కార్మికుల హక్కు.. వైద్యం కూడా వారి హక్కే!
- కార్మికుల డబ్బు కోట్లలో.. ఆసుపత్రిలో మందులు మాత్రం కరువా?
- 9.77 లక్షల మందికి ఇదేనా ఈఎస్ఐ వైద్యం?
- మందులు లేవు.. కిట్లు లేవు.. మరి వైద్యం ఎలా?
- కార్మికుల చందాలు తీసుకుంటారు.. వైద్యం ఎందుకు ఇవ్వరు?
- నిధులు కోట్లలో.. సౌకర్యాలు మాత్రం శూన్యమా?
- ఈఎస్ఐ ఆసుపత్రి బలోపేతం ఎప్పుడు?
- కార్మికుల ఆరోగ్యంపై ఇకనైనా శ్రద్ధ చూపాలి




2లో

రామచంద్రాపురం ఈఎస్ఐ పరిధిలో
9.77 లక్షల మంది లబ్ధిదారులు..

మందులు, ల్యాబ్ కిట్లు, సర్జికల్ వస్తువుల కొరతపై సిటీయు ఆందోళన

మందులు లేవు | ల్యాబ్ కిట్లు లేవు | సర్జికల్ వస్తువులు లేవు

కార్మికుల డబ్బు.. కార్మికులకే సేవ కావాలి!

# సినీ ఫక్కీలో..స్మగ్లింగ్

### రూ. 1.5 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం-ఆరుగురు అరెస్ట్



వెండితెరపై థ్రిల్లర్ సినిమాల్లో చూసే డ్రగ్స్ స్మగ్లింగ్ దందాను తలపిస్తూ.. కడుపుకి, రెండు కాళ్లకు బ్రౌన్ సెల్లో టేపులతో డ్రగ్స్ ప్యాకెట్లను చుట్టకొని డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను ఎల్బీనగర్ ఎస్ఓటీ, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్ట్ చేసి రూ. 1.5 కోట్ల విలువైన 12 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఎల్బీనగర్ క్యాంప్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఏపీ నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూర్‌కు భారీగా హాష్ ఆయిల్ రవాణా అవుతుందని ఎల్బీనగర్ ఎస్ఓటీ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వనస్థలిపురం పోలీసులతో కలిసి చింతల్‌కుంట ప్రాంతంలో బెంగళూర్ బస్సు ఎక్కేందుకు ప్రయత్నంలో ఉన్న ఆరుగురుని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆరుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడగా అందులో ఒక మహిళ, ఇద్దరు మైనర్లు ఉన్నారు.

# నేటి నుంచి కేబీఆర్ చుట్టూ వన్‌వే

### పార్క్ వద్ద 13 లైన్ ఛేంజర్స్, 10 ఎగ్జిట్స్




బంజారాహిల్స్: కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ అమలుకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే అమలు చేయనున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పార్కు చుట్టూ మొత్తం 13 లైన్ ఛేంజర్స్, 10 ఎగ్జిట్‌లను ఏర్పాటు చేశారు. కీలక ప్రాంతాల్లో రోడ్ మార్ఫింగ్, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల రాకపోకలను సీసీ కెమెరాలు, డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్స్, విజిటర్స్ కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. వన్‌వే ట్రాఫిక్ విధానం దాదాపు రెండేళ్ల పాటు అమలులో ఉంటుందని, వాహనదారులు కొత్త ట్రాఫిక్ విధానానికి సహకరించాలని జోయల్ డేవిస్ కోరారు. హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల క్రమంలో కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని, వన్‌వే ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని వాహనదారులు తమ ప్రయాణాల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం


**రామకృష్ణాపూర్ ఆగస్టు17 (క్రైమ్ మిర్రర్ ):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ హామీ ఇచ్చారు. లబ్ధిదారుల విజ్ఞప్తి మేరకు ఆ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన కాలనీని సందర్శించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2019లో అప్పటి ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు సకాలంలో కేటాయించకపోవడంతో తలుపులు, కిటికీలు, సెప్టిక్ ట్యాంకులు ధ్వంసమై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని తెలిపారు. 2023లో చెన్నూరు ఎమ్మెల్యేగా మంత్రి వివేక్ వెంకటస్వామి ఎన్నికైన అనంతరం సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మంత్రి స్పందించి రూ.27 లక్షల నిధులతో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా పునరుద్ధరణ పనులు పూర్తి చేయించినట్లు పేర్కొన్నారు. అనంతరం 2025లో 230 మంది అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్లను కేటాయించి మున్సిపాలిటీకి అప్పగించినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం 60 కుటుంబాలు మాత్రమే ఇళ్లలో నివసిస్తున్నాయని, మరో 170 కుటుంబాలు గృహప్రవేశం చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు వారికి



నోటీసులు జారీ చేశారని, నిర్ణీత గడువులోగా ఇళ్లలోకి రాకపోతే కేటాయింపులు రద్దు చేసి ఇతర నిరుపేదలకు ఇళ్లు కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాలు, రహదారులు, భవనాల చుట్టూ పెరిగిన పిచ్చిచెట్ల సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌తో చర్చించామని, త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వార్డులకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. అవసరమైతే మంత్రి వివేక్ వెంకటస్వామిని స్వయంగా కాలనీకి తీసుకొచ్చి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

# చందాలు వసూలు చేయడంలో వేగం..!
# వైద్యం అందించడంలో నిర్లక్ష్యం..!

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 17:** కార్మికుల నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ చందాలు క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నప్పటికీ, వారికి అందాల్సిన వైద్య సేవల్లో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని సిఐటియు నాయకులు, ఈఎస్ఐ మాజీ బోర్డు సభ్యుడు బి. అర్జున్ ఆరోపించారు. రామచంద్రాపురం ఈఎస్ఐ పరిధిలో సుమారు 2.44 లక్షల మంది ఐపీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 9.77 లక్షల మంది వైద్య సేవలపై ఆధారపడుతున్నారని తెలిపారు. జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, ఇస్నాపూర్, పాశామైలారం, బొల్లారం, కాజీపల్లి తదితర పారిశ్రామిక ప్రాంతాలకు రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రధాన వైద్య కేంద్రంగా ఉందన్నారు. ఇంత పెద్ద పరిధిలోని కార్మికులకు సేవలందిస్తున్న ఆసుపత్రి, డిస్పెన్సరీల్లో ప్రాథమిక మందులు, ల్యాబ్ కిట్లు, సర్జికల్ వస్తువులు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమన్నారు. కార్మికుడి వాటా 0.75 శాతం, యజమాని వాటా 3.25 శాతంగా కలిపి మొత్తం 4 శాతం ఈఎస్ఐ చందా చెల్లిస్తున్నారని అర్జున్ తెలిపారు. సగటు నెల జీతం రూ.15,000గా పరిగణిస్తే, రామచంద్రాపురం పరిధిలోని 2,44,265 మంది ఐపీ సభ్యుల ద్వారా నెలకు సుమారు రూ.14.66 కోట్లు, ఏడాదికి రూ.175 కోట్లకు పైగా చందా వస్తుందని వివరించారు. "కార్మికుల నుంచి కోట్ల రూపాయల చందాలు వసూలు చేస్తున్నప్పుడు.. అదే కార్మికులకు అవసరమైన మందులు, పరీక్షలు ఎందుకు అందుబాటులో ఉండటం లేదు?" అని ఆయన ప్రశ్నించారు. రామచంద్రాపురం పరిధిలోని ఇస్నాపూర్, సదాశివపేట, జహీరాబాద్, పాటిగనాపూర్, పటాన్‌చెరు, బంతపల్లి, సంగారెడ్డి, శబాష్‌పల్లి తదితర 8 ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో మందుల కొరత ఉందని సిఐటియు పేర్కొంది. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఉపయోగించే మందులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. అలాగే టెటనస్ ఇంజెక్షన్లు, మూత్ర పరీక్ష కిట్లు, వాకర్స్, వాకింగ్ స్టిక్స్, గ్రిప్ బ్యాండేజీలు, సర్వికల్ కాలర్లు, ఎల్ఎస్ బెల్టు తదితర వైద్య వస్తువులు



అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరింది. మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షలకు అవసరమైన కిట్లు, రియాజెంట్లు కూడా నిరంతరం సరఫరా చేయాలని డిమాండ్ చేసింది. హెచ్‌బీఏ1సీ, ఆర్‌బీఎస్, యూరియా, సీరమ్ క్రియాటినిన్, కాలేయ పనితీరు, మూత్రపిండాల పనితీరు, థైరాయిడ్ తదితర పరీక్షలకు సంబంధించిన ల్యాబ్ పరికరాలు, కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు కోరింది. పరీక్షలు సక్రమంగా జరగకపోతే రోగులకు సరైన సమయంలో నిర్ధారణ, చికిత్స ఎలా అందుతుందని ప్రశ్నించింది.

**24 గంటల వైద్య సేవలు కల్పించాలి:**

రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిని 24 గంటల వైద్య సేవలతో బలోపేతం చేయాలని అర్జున్ డిమాండ్ చేశారు. ఆపరేషన్ థియేటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఐసియు, వెంటిలేటర్, అత్యవసర వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 100 పడకలను 200 పడకలకు పెంచాలని, భవిష్యత్తులో సిటి స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచకుండా పడకల వినియోగం తక్కువగా ఉందని అభివృద్ధిని నిలిపివేయడం సరికాదన్నారు. ముందుగా మందులు, వైద్య సిబ్బంది, ల్యాబ్ సేవలు, అత్యవసర వైద్యం అందుబాటులోకి వస్తే రోగుల్లో నమ్మకం పెరిగి ఓపీ సేవలు, పడకల వినియోగం కూడా పెరుగుతాయని తెలిపారు.

**వెంటనే నిధులు కేటాయించాలి:**

ఈఎస్ఐ కార్పొరేషన్, ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రి, 8 డిస్పెన్సరీలను బలోపేతం చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. మందులు, సర్జికల్ వస్తువులు, ల్యాబ్ కిట్లు నిరంతరాయంగా సరఫరా చేయడంతో

# సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** జర్నలిస్ట్ యూనియన్ అయిన "టి యు డబ్ల్యు జె హెచ్-143" సభ్యత్వ నమోదుకు అనూహ స్పందన లభిస్తుందని టీయూడబ్ల్యూజే హెచ్-143 నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కొమ్ము యాదగిరి, శిరిసు రమేష్ అన్నారు. చిట్యాల లో సోమవారం టీయూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జర్నలిస్టులకు యాదగిరి, రమేష్ లు సభ్యత్వాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం లో టి యు డబ్ల్యు జె హెచ్ -143 ముందంజలో ఉంటుందని, వారి అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. మండలంలో సభ్యత్వాలను జర్నలిస్టు ఉత్సాహంగా తీసుకున్నారని తెలిపారు. నమోదు పూర్తయ్యాక నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగనున్నదన్నారు. టి యు డబ్ల్యు జె హెచ్ -143 చిట్యాల మండలం అధ్యక్షుడు రేగొండ వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బుస శ్రీనివాస్ కార్యదర్శి మూడ వేణు, నియోజకవర్గ అధ్యక్షుడు కొల్లు శ్రీకాంత్, యూనియన్ ప్రధాన కార్యదర్శి చెన్నోజు చంద్రశేఖర్, కార్యదర్శి మూడ వెంకటాద్రి, నాయకుడు జిట్ట నరేష్, మాజీ అధ్యక్షుడు కారంపూడి మధు, గుండ్లపల్లి వెంకన్న, దేశగొని సాయికుమార్, అంతటి నాగరాజు గౌడ్, పల్లపు ప్రశాంత్, మహేందర్ రెడ్డి, ఆనంద్ కుమార్, శంకర్ మందడి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుట్ట మధు పర్యటనతో బీఆర్ఎస్‌లో జోష్..!!

- ఆత్మీయంగా కలిసిన సూరారం బీఆర్ఎస్ శ్రేణులు
- బైక్ ర్యాలీతో హోరెత్తిన మండల కేంద్రం

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పర్యటన బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పుట్ట మధు పర్యటన సందర్భంగా సూరారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఆప్యాయంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై పరస్పరం చర్చించారు. మాజీ ఎమ్మెల్యేకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించడంతో మహాదేవపూర్ మండల కేంద్రంలో సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని పార్టీ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. పుట్ట మధు రాకతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.





# వివాహ వార్షికోత్సవ వేడుకలకు సేవా స్ఫూర్తి

**క్రైమ్ మిర్రర్,శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి అగ్రికల్చరల్ మార్కెటింగ్ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి కుమారుడు చేకూర్త మధుకర్‌రెడ్డి, చేకూర్త నిఖిలారెడ్డి దంపతులు తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహాలింగాపురం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు, విద్యార్థినులకు పుస్తకాలు, డిక్షనరీలు, బ్లాక్‌బోర్డులు, అట్లాస్‌లు అందజేసి వారి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు. వివాహ వార్షికోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమంతో నిర్వహించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీరాములు, మల్లికార్జున స్వామి, రమ, అనుపమ, గీతాంజలి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే జార్జిరెడ్డి పి డి ఎస్ యు రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి -పైండ్ల శ్యామల.

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఈ నెల 24, 25 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న జార్జిరెడ్డి పి డి ఎస్ యు రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరుతూ ఖమ్మంలోని యస్ ర్ అండ్ బి జి ఎన్ ర్ డిగ్రీ కళాశాల, మరియు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, జిల్లా నాయకులు జస్వంత్, శ్రీనిధి మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక, రాజకీయ అవగాహన పెంపొందించేందుకు రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు దేశ రాజకీయాలు, సామాజిక పరిస్థితులు, విద్యార్థుల సమస్యలు, విద్యారంగంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వాన్ని, అధ్యయనం చేసే అలవాటును, సమాజం పట్ల బాధ్యతను విద్యార్థులు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్,గోపి,కావ్య,సతీష్ రెడ్డి, నవ్య,మౌనిక, సంధ్య, విశ్వాస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లపై కాంగ్రెస్ కుట్ర.. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు బ్రేక్ ఎందుకు?”

కల్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్‌పై స్టే ఎత్తివేయాలి పేదింటి ఆడబిడ్డల జీవితాలతో చెలగాటం వద్దు.. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

ఎన్నికల హామీలో లక్ష రూపాయలు, తులం బంగారం అన్న కాంగ్రెస్.. కనీసం గత ప్రభుత్వ పథకాన్నీ కొనసాగించలేకపోతోంది

చింతకాని తహసీల్దార్‌కు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు విధించిన స్టేను వెంటనే ఎత్తివేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతకాని మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



### కేసీఆర్ ప్రభుత్వంలో పదేళ్ల పాటు నిరంతరంగా అమలు

బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు సుదీర్ఘంగా కొనసాగాయని, ఎలాంటి న్యాయపరమైన ఆటంకాలు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందించామని పేర్కొన్నారు. 2014లో ప్రారంభమైన ఈ పథకాలు పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ఆర్థిక అండగా నిలిచాయని అన్నారు. ప్రస్తుతం హైకోర్టు స్టే కారణంగా పెళ్లిళ్లు చేసుకున్న పేద కుటుంబాలు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తులం బంగారం దేవుడెరుగు.. కేసీఆర్ ఇచ్చిన కల్యాణ లక్ష్మి చెక్కులూ ఇవ్వడం లేదు! కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ తులం బంగారం సంగతి దేవుడెరుగు.. గత కేసీఆర్ ప్రభుత్వం అందించిన కల్యాణ లక్ష్మి ఆర్థిక సాయాన్ని కూడా సకాలంలో అందించకుండా పేద కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. పథకాన్ని నిలిపివేసేలా న్యాయపరమైన చిక్కులు ఏర్పడటానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆరోపించారు. కోర్టులో కేసులు, స్టే పేరుతో పేదింటి ఆడబిడ్డలకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు, ఇప్పటికే అమలులో ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే స్టేకు కారణమని ఆరోపణ

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాల విషయంలో తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తమకు అనుకూలమైన వ్యక్తులు, అనుచరులతో పిటిషన్లు వేయించి పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని వారు విమర్శించారు. అయితే పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి కాంగ్రెస్ అనుచరుడని నిర్ధారించే ఆధారం తమ వద్ద లేదని, ఇది బీఆర్ఎస్ నాయకులు చేసిన రాజకీయ ఆరోపణ మాత్రమేనని స్పష్టం చేశారు. హైకోర్టు పథకాల అమలుకు సంబంధించిన ఎనిమిది జీవోలపై మధ్యంతర స్టే విధించి, తదుపరి విచారణ వరకు లబ్ధిదారులకు చెల్లింపులు చేయవద్దని ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు కోరారు.

### రివ్యూ పిటిషన్ దాఖలు చేసి పేదలకు న్యాయం చేయాలి

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు రాజకీయాలకు అతీతంగా పేద కుటుంబాల సంక్షేమానికి సంబంధించినవని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. హైకోర్టు స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయ నిపుణులతో సంప్రదించి రివ్యూ/తగిన న్యాయపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు నష్టం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పథకాలపై ఉన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి మళ్లీ యథావిధిగా చెక్కుల పంపిణీ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, గురజాల హనుమంతరావు, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పొనుగోటి రత్నాకర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామినేని అప్పారావు, వంకాయలపాటి సత్యనారాయణ, సర్పంచి చేపల మడుగు వీరబాబు, పరిశుద్ధ రావు, గడ్డం శ్రీను బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు జావిద్, చలమయ్య, షబ్బీర్, చంద్రయ్య తదితరులు పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# వాజపేయ్ నగర్ ఆర్ యు బి పనులు పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి

### ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాజ్‌పేయి నగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మరియు ఉత్తమ్ నగర్‌లో జరుగుతున్న సి సి రోడ్డు పనులను సోమవారం మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్-× కె రాహుల్ రెడ్డి,మల్కాజ్‌గిరి ట్రాఫిక్ సి ఐ బి. నరసింహ,రైల్వే , ఎం ఎం సి అధికారులు ఏ ఈ దివ్య జ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంతో కలిసి పనులు జరుగు ప్రదేశాలను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో అవసరమైన ట్రాఫిక్ డైవర్షన్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ మరియు నిర్వహణ చర్యలపై అధికారులతో చర్చించారు. నిర్మాణ పనుల కారణంగా వాహనదారులు మరియు సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్-మల్కాజ్‌గిరి సంబంధిత అధికారులకు ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించడం, రోడ్డు వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడడం మరియు నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు సాధారణ ట్రాఫిక్ రాకపోకలు సజావుగా, నిరంతరాయంగా కొనసాగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# స్కాలర్షిప్స్ విద్యార్థులకు ఇస్తున్న దానం కాదు.





- ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాలను ముట్టడించిన పి డి యస్ యూ నాయకులు
- పి డి ఎస్ యు నాయకుల అరెస్టు
- కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తుంది.
- కాంపాటి పృథ్వీరాజ్ రాష్ట్ర అధ్యక్షులు.

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలైనా నేటికీ ప్రజా పాలన అంటూ ఉదరగొట్టడమే తప్ప విద్యార్థులకు ఇచ్చే రియంబర్స్మెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు మెదపడం లేదని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అన్నారు. పిడిఎస్యు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఉమ్మడి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాల ముందు విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమాన్ని పోలీసులు విచ్చిన్నం చేసి నిరసన చేపట్టిన విద్యార్థి సంఘ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. మంత్రుల క్యాంపు కార్యాలయం ముందు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. విద్యార్థులు మా స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ మాకు ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. స్కాలర్షిప్స్ ఉద్యమానికి నాయకత్వం వహించిన పిడి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, పి డి యస్ యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. లక్ష్మణ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ తో పాటు మరి కొంతమంది విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్కాలర్షిప్స్ అంటే పాలక ప్రభుత్వాలు కేవలం ఒక సంక్షేమ పథకంలా చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నరు తప్ప అదొక సామాజిక సమస్యగా, సామాజిక బాధ్యతగా చూడడం లేదని అన్నారు. పాలక ప్రభుత్వాలు రేయంబర్స్మెంట్ విషయంలో ఆలస్యం చేయడం కారణంగా విద్యార్థులు పరీక్ష ఫీజులు, పుస్తకాల ఫీజులు,ప్రయాణ కర్చులు, హాస్టల్ ఫీజులు, ల్యాబ్ ఇతర సౌకర్యాల ఖర్చులు కట్టలేని పరిస్థితి ఏర్పడే ఒత్తిడి గురై ఇంజనీరింగ్,మెడికల్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు డ్రాపౌట్స్ అవుతూ పై చదువులకు వెళ్లలేక పోతున్నారని అన్నారు. విద్యార్థుల ఖాతాల్లోకి స్కాలర్షిప్స్ వేయడంలో ఆలస్యం కారణంగా పేద విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా ప్రభుత్వ విధానం ఉందని వారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే కమిటీల పేరుతోనే కాలయాపన చేయడం మూలంగా విద్యాసంస్థలు రోడ్డెక్కి బందులు పాటించినా, విద్యార్థులు మంత్రుల ఇండ్లు ముట్టడించిన ప్రభుత్వాలు తీరు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరికి కోర్టులు సైతం చొరవ చేసుకొని విద్యార్థులకు రియంబర్స్మెంట్ ఇవ్వాల్సిందే అని ఆదేశాలు జారీ చేసిన ఏమాత్రం సోయి లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బేఖాతరు చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా పేద విద్యార్థులకు ఆర్థిక సహకారంగా ఉన్న రియంబర్స్మెంట్ ను కొనసాగిస్తూ పెండింగ్ లో ఉన్న 10వేల కోట్లను తక్షణమే విద్యార్థులకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, పి డి యస్ యూ ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ల నాయకులు సురేష్, హరిచంద్ర ప్రసాద్, రఘు, రామ్ చరణ్, మురళి నాయకులు మనోజ్, సుశాంత్, గోపి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'పొంగులేటి' అభయం.. నిరుద్యోగులకు 'రైట్ ఛాయిస్'!

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పోలీస్ కొలువు సాధించి ఖాకీ డ్రెస్‌లో చూడాలనే పేద తల్లిదండ్రుల కలలకు, నిరుద్యోగ యువత పట్టుదలకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉచిత కోచింగ్ కొండంత అండగా నిలుస్తోంది. రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్ నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో.. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని అభ్యర్థుల కోసం ఖమ్మం, కొత్తగూడెం పట్టణాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 2016లోనే పొంగులేటి ఉచిత కోచింగ్ ద్వారా వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించి నిలదొక్కుకున్నారని గుర్తుచేశారు. ఈసారి హైదరాబాద్‌కు చెందిన అత్యుత్తమ ఫ్యాకల్టీలతో నాణ్యమైన బోధన అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ప్రతిరోజూ మాక్ టెస్టులు, ఉచితంగా ప్రింటెడ్ స్టడీ మెటీరియల్, వారానికోసారి గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ ఫలితమే లక్ష్యంగా తరగతులు నడుస్తాయన్నారు. రాష్ట్రంలో పోటీ పరీక్షల శిక్షణలో అగ్రగామిగా ఉన్న 'రైట్ ఛాయిస్ అకాడమీ' చైర్మన్ మెండెం కిరణ్ కుమార్ నేతృత్వంలో ఈ పొంగులేటి ఉచిత శిక్షణ సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. గతంలో 2016లో పొంగులేటి-రైట్ ఛాయిస్ కలయికలో ఇచ్చిన శిక్షణ ద్వారా ఒకే బ్యాచ్ నుంచి ఏకంగా 326 మంది కానిస్టేబుళ్లు, 18 మంది ఎస్ఐలు ఎంపికై చరిత్ర సృష్టించారని కిరణ్ గుర్తుచేశారు. ఉద్యోగం సాధించాలనే బలమైన సంకల్పం ఉన్న ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. శిక్షణ పొందేందుకు అభ్యర్థులు తమ వివరాలను (పేరు, ఫోన్ నంబర్, గ్రామం, మండలం, నియోజకవర్గం) క్రింది నంబర్లకు వాట్సాప్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఖమ్మం జిల్లా అభ్యర్థులు 8985095599, భద్రాద్రి కొత్తగూడెం అభ్యర్థులు 8985096699 సంప్రదించాలని మెండెం కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కోసూరి శ్రీను, కొప్పుల అశోక్ , బజ్జూరి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ వెంకట్ రెడ్డి, వెన్నుపూసల సీతారాములు, బానోత్ కిశోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.






# ఏలె మహేష్ నేతకు కళా పాత్రికేయ పురస్కారం

**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,ఆగస్ట్ 17:** ప్రముఖ వీ6 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రికల సీనియర్ కరస్పాండెంట్ ఏలె మహేష్ నేతకు స్వరమాధురి కళా పాత్రికేయ పురస్కారం లభించింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన స్వర నృత్య వేడుకలో భాగంగా శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. స్వరమాధురి సాహితి సాంస్కృతిక సేవా సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి స్వరమాధురి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిరికొండ మధుసూదనాచారి అవార్డు గ్రహీతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పనిచేస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని అన్నారు. 24 గంటలు విధి నిర్వహణలో నిమగ్నమై సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టులు నిజమైన వారియర్స్ అని కొనియాడారు. కార్యక్రమంలో స్వరమాధురి సాహితి సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు సాయి పావని, చేపూరి శంకర్, చేపూరి రాజు పాల్గొన్నారు.

# పరుగులు తీస్తున్న ప్రతిభ..

**విజయతీరాల వైపు క్రీడాకారుల పయనం**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ సోమవారం కల్వకుర్తి జయప్రకాశ్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో విజయవంతంగా నిర్వహించారు. వచ్చే నెల 26, 27 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న 12వ తెలంగాణ స్టేట్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 250 మందికి పైగా క్రీడాకారులు సెలక్షన్స్‌లో పాల్గొని వివిధ విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు ఈ వివరాలను వెల్లడించారు. సెలక్షన్స్‌ను కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు భిక్షపతి, పీడీలు ప్రసాద్, బాలయ్య, చంద్రశేఖర్, మల్లేష్, బాలుసు, లక్ష్మి, జ్యోతి, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.





## సుజాతకు ఉత్తమ ఉద్యోగ ప్రతిభ పురస్కారం

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** సమగ్ర శిక్షా అభియాన్ పర్యవేక్షకురాలు సుజాతకు ఉత్తమ సూపరింటెండెంట్ ఉద్యోగ ప్రతిభ పురస్కారం లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథి చిన్నారెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు సుజాతను ఘనంగా అభినందించారు. డీఈఓ రమేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న వివిధ విద్యా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని డీఈఓ సూచించారు. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ స్కూళ్ల నిర్వహణను మరింత మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల విద్యా ఫలితాలను మెరుగుపరచడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సుజాతకు లభించిన పురస్కారం ఇతర అధికారులు, ఉద్యోగులకు సైతం స్ఫూర్తిదాయకమని డీఈఓ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత తుమ్మల నాగేశ్వరరావు అని నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న మచ్చలేని నాయకుడని, తుమ్మల నాగేశ్వరరావు పై అసత్య ప్రచారం ఆకాశంలో ఉమ్మి వేసిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. అదే విధంగా ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలానికి గోదావరి జలాలు తీసుకొచ్చారని, వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ, కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ స్కూలు చెప్పుకొంటూ పోతే కోకొల్లలని అన్నారు ఇప్పటికైనా అవాకులు చెవాకులు మాని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. అదే విధంగా ప్రజాపాలన గావిస్తున్న ప్రజా ప్రభుత్వ రథ సారథి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు సహచర మంత్రి వర్గ సహచరులతో కలిసి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ పువ్వాడ అజయ్ కుమార్ అరాచకాలు, కబ్జాలకు బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు, శుద్ధపూస మాటలు మనాలని హితవు పలికారు. సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పువ్వాడ అజయ్ కుమార్ ఏమీ మాట్లాడక పోతే వెనుకబడి పోతానని ప్రజా పాలన గావిస్తున్న ప్రభుత్వం, నాయకులపై అవాకులు, చెవాకులు మానుకోవాలని హితవు పలికారు.



# కటకం అశోక్‌కు పద్మశాలి సంఘం అభినందనలు..!!

- పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సత్కారం
- పద్మశాలీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి
- పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి : కటకం అశోక్



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కటకం అశోక్‌ను మహాదేవపూర్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు శాలువాతో సత్కరించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలోని పద్మశాలి కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. పద్మశాలి సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కటకం అశోక్‌ను కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కటకం అశోక్‌కు..**

తనను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ అధిష్ఠానానికి, మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తనను సన్మానించిన పద్మశాలి సంఘం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పద్మశాలి సంఘం నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, వారి సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పేర్ని గట్టు స్వామి, జిల్లా జనరల్ సెక్రెటరీ మాచర్ల కిరణ్, మహాదేవపూర్ మండల అధ్యక్షుడు పంతకాని సమ్మయ్య, మహాదేవపూర్ పట్టణ అధ్యక్షుడు పంతకాని రాజు, బేగ్లూర్ గ్రామశాఖ అధ్యక్షుడు దూలం సమ్మయ్య, కాళేశ్వరం గ్రామశాఖ అధ్యక్షుడు మాచెర్ల సత్తయ్య, అంబటిపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పినగాని రమేష్, సూరారం గ్రామశాఖ అధ్యక్షుడు శామాల సమ్మయ్య, పద్మశాలి సంఘం మహిళా నాయకురాలు భాగ్య, సంఘం నాయకులు బాల్నే సమ్మయ్య, మాచర్ల అరుణ్, దూలం రాజయ్య, దోమల ప్రవీణ్ కుమార్, దూలం నగేష్, కొండే దేవేందర్, శ్రీరాముల శ్రీనివాస్, గోరంట్ల రాజు, సభని వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శివకేశవ ఆలయంలో శ్రావణమాస పూజలు..!!

- ప్రత్యేక అలంకరణలో స్వామివారి దర్శనం కోసం తరలివస్తున్న భక్తులు
- నిత్య అభిషేకాలు, అర్చనలు, భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామ శివకేశవ దేవాలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకులు వంగల సత్యనారాయణ చారి ఆధ్వర్యంలో ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. శ్రావణమాసం సందర్భంగా స్వామివారి ప్రత్యేక అలంకరణలను దర్శించుకునేందుకు సూరారం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయంలో ప్రతిరోజూ నిత్య అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను వితరణ చేస్తున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటే మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక భావన కలుగుతుందని భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ అర్చకులు వంగల సత్యనారాయణ చారి మాట్లాడుతూ, శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

# ఉచిత విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలి: గోపి రజక



**కొత్తకోట, ఆగస్టు 17(క్రైమ్ మిర్రర్)::** రజక వృత్తిదారులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి వృత్తిదారులకు ఊరట కల్పించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షులు పేరూరి బాలస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పథకానికి సంబంధించిన విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో వృత్తిదారులపై వేల రూపాయల బిల్లులు పేరుకుపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో సోమవారం పట్టణ అధ్యక్షులు పేరూరి బాలస్వామి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి గోపి రజక , ఇటిక్యాల బండలయ్య ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఉచిత విద్యుత్ పథకం అమలులో ఏర్పడుతున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాసాల లక్ష్మయ్య మాట్లాడుతూ, ప్రజాసంక్షేమ ప్రభుత్వంలో రజక వృత్తిదారులు విద్యుత్ బిల్లుల విషయంలో తీవ్ర అయోమయానికి గురవుతున్నారని అన్నారు. బకాయిలు పెరిగిపోతుండటంతో భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోతే తమ ఆస్తులను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వస్తుందేమోనని వృత్తిదారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సీనియర్ రజక నాయకులు రాసాల మన్యెం మాట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని వృత్తిదారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను గతంలోనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు.



## రోలం ఇన్‌లైన్ హాకీ 2వ ఇండిపెండెన్స్ కప్-2026 ఘన ముగింపు

**ఎల్బీనగర్,క్రైమ్ మిర్రర్,ఆగస్ట్ 17:** ఎల్.బి.నగర్ నియోజకవర్గం వనస్థలిపురంలోని ఏ టైప్ క్వార్టర్స్ సమీపంలోని వనస్థలి స్కేటింగ్ రింక్ (చెఫ్ క్వెస్ట్) వేదికగా నిర్వహించిన రోలర్ ఢ ఇన్‌లైన్ హాకీ 2వ ఇండిపెండెన్స్ కప్–2026 పోటీలు క్రీడా స్ఫూర్తితో ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజగోపాల్, సంయుక్త కార్యదర్శి జి. అజయ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ స్కేటర్ల క్రమశిక్షణ, ప్రతిభ, క్రీడా స్ఫూర్తిని అభినందించారు. స్కేటర్లు, వారి తల్లిదండ్రులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న టి.ఆర్.ఎస్.ఎ. అఫిలియేషన్ సమస్య పరిష్కారానికి వ్యక్తిగతంగా చొరవ తీసుకుంటానని తెలిపారు. ఈ సమస్యపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాల దేవిని కలిసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన సాంకేతిక కమిటీ ఛైర్మన్ సత్య, ఉపాధ్యక్షులు అబ్దుల్ ఖురేషి, వట్టి శ్రీను, ముస్తఫా, అహ్మద్, అఫీజ్, సిద్దిక్, కోమల్, ఆకాష్ సేవలను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే నిర్వహణ కమిటీ సభ్యులు సాయి (రాజు), వంశీ చేసిన కృషిని కొనియాడారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన స్కేటర్లు, తల్లిదండ్రులు, కోచ్‌లు, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధికారులు, సాంకేతిక మరియు నిర్వహణ కమిటీ సభ్యులకు నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నిర్వహణ కమిటీ ఛైర్మన్ టంగుటూరి నాగరాజుతో పాటు పలువురు క్రీడా ప్రతినిధులు, నిర్వాహకులు, స్కేటర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఐక్యతకు ప్రతీకగా..'మతసామరస్య సందేశం'

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** మతాలు వేరైనా.. మనసులు ఒక్కటేనని చాటుతూ మహదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్ దంపతులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు. గ్రామంలో నిర్వహించే హిందూ పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సైతం భక్తిశ్రద్ధలతో పాల్గొంటూ అందరి మన్ననలు పొందుతున్నారు. మహదేవపూర్ గ్రామ పరిధిలోని నగేంద్రగిరి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద సోమవారం నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్ దంపతులు ఆలయానికి చేరుకుని పుట్ట వద్ద పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని నాగేంద్ర స్వామిని ప్రార్థించారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ దంపతులు హిందూ పండుగలో భక్తిశ్రద్ధలతో పాల్గొనడం గ్రామంలో ప్రత్యేకంగా నిలిచింది. మతం ఏదైనా.. పండుగలు అందరివి, గ్రామ అభివృద్ధి మరియు ప్రజల ఐక్యతే తమ లక్ష్యమని వారు చాటుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు గద్దం స్వామి, మొహమ్మద్, కొండపల్లి రాములు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై నాగేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## మాస్ లైన్ పార్టీ నాయకుడు రాయల చంద్రశేఖర్ ఆత్మహత్యపై న్యూ డెమోక్రసీ బహిరంగ విచారణకు సిద్ధం కావాలి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మా పార్టీ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) పై న్యూ డెమోక్రసీ కేంద్ర, రాష్ట్ర ప్రధాన న్యాయకత్వం మా పార్టీ కేంద్ర కమిటీ కంట్రోల్ కమిషన్ మాజీ చైర్మన్ అమరుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ అకాలంగా ఆత్మహత్య చేసుకున్న రెండు సంవత్సరాల తర్వాత 2వ వర్ధంతి సందర్భంగా ఆత్మహత్యను ఆసరా చేసుకుని న్యూడెమోక్రసీ నాయకత్వం న్యాయ విచారణ జరిపించాలని మా పార్టీపై విమర్శలు చేస్తూ మాట్లాడటం తప్పుడు ఆరోపణలు చేస్తున్న తప్పుడు వైఖరిని అనుసరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య ఘాటుగా విమర్శించారు, ఇప్పటికైనా న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట రామయ్య, పి ప్రసాద్, సాదినేని వెంకటేశ్వరరావు, ఆవునూరి మధులు నిజాయితీగల మధ్యవర్తిని పెట్టుకుని విచారణకు రావాలని ఆహ్వానిస్తున్నామనీ, సిద్ధం కావాలని కోరుతున్నామన్నారు. సోమవారం ఖమ్మంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం లో, జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు . గుమ్మడి నరసయ్య, సి వై పుల్లయ్య హాజరై మాట్లాడుతూ ఆగస్టు 16న ఆదివారం ఖమ్మంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో రాయల చంద్రశేఖర్ జీవిత సహచరి విమల రాసిన" ఒక విప్లవ భగ్న ప్రేమికుడు" పుస్తకావిష్కరణ సభను ఏర్పాటు చేసింది. న్యూ డెమోక్రసీ ప్రధాన నాయకత్వం పాల్గొని మా పార్టీ మాసులైన్పై విమర్శలు చేయాలని లక్ష్యంగా చేసుకున్నారన్నారు. రాయల చంద్రశేఖర్ ఆత్మ హత్యకు మా పార్టీ బాధ్యత వహించాలని బాధ్యతా రాహిత్యంతో పార్టీ న్యూడేమోక్రసి నాయకత్వం విమర్శలు చేస్తూ మాట్లాడటం విడ్డురంగా ఉందని వారన్నారు. ఉద్యమంలో ఎదుర్కొన్న ఒత్తిడి, చివరి దశలో చోటు చేసుకున్న పరిణామాలపై లోతైన సమీక్ష అవసరం అని మాట్లాడటం అంటే రాయల చంద్రశేఖర్ మృతిని రాజకీయ లబ్ధి కోసం వెంపర్లాడుతున్నట్లుగా ఉందని వారు విమర్శించారు. మాసులైన పార్టీతో చంద్రశేఖర్కు ఏర్పడిన విభేదాలు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు ఆయనను కుంగతీసిన పరిస్థితులు ఉన్నాయని మాట్లాడటం దుర్మార్గమని వారన్నారు. వ్యక్తిని బలహీనమైన పరిస్థితులకు నెట్టడానికి ఎవరు కారణమయ్యారనే అంశాన్ని కూడా సమీక్షించాలని





అనడంలో ఆంతర్యం ఏమిటని వారు విమర్శించారు. విమలపై చంద్రశేఖర్ పై వివిధ రకాలుగా నేరస్తులుగా ముద్రలేసే ప్రయత్నాలు జరిగాయని చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. చంద్రశేఖర్ కుటుంబం చివరి రోజులలో చోటుచేసుకున్న పరిణామాలను సమాజం ముందుకు తీసుకు రావాల్సిన అవసరం ఉన్నదటంలో మాసులైన్ పార్టీని దెబ్బతీయటానికి చేస్తున్న ప్రయత్నమేనని అన్నారు. చంద్రశేఖర్ మృతి తర్వాత కూడా కుటుంబంపై దాడులు కొనసాగుతున్నాయని అనడం పచ్చి అబద్ధమని అలకలు చెందినవారు అసంతృప్తి వాదులను వారి పంచన చేర్చుకుని,రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం సరికాదని వారన్నారు. మాస్ లైన్ పార్టీ తన వైఖరిని సమీక్షించుకోవాలని, తమలో ఎలాంటి తప్పు లేకపోతే సభకు పిలిస్తే ఎందుకు రాలేదనటం విచిత్రంగా ఉన్నదని వారన్నారు. రాయల చంద్రశేఖర్ ది ఆత్మహత్య, హత్యయని, వాస్తవాలపై వెలుగులోకి రావాలని, రాయల చంద్రశేఖర్ మృతిని ఆత్మహత్యగా కాకుండా హత్యగా అనుమానించాల్సిన పరిస్థితులు ఉన్నాయనడంలో పూర్తి అవాస్తవాలు, మాస్ లైన్ పార్టీ ఎదుగుదలను, అభివృద్ధిని చూసి ఓరవలేక చేస్తున్న విమర్శలుగా భావించాలని వారు ప్రజలను కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుర్రం అచ్చయ్య, జిరామయ్య, ఆవుల అశోకులు మాట్లాడుతూ రాజకీయంగా న్యూ డెమోక్రసీ పార్టీ లోపాలను ప్రక్కన పెట్టి మాసులైన్ పార్టీపై బురద జల్లాలని చూడటం సూర్యునిపై ఉమ్మేసినట్లుగా ఉందని, మీ కంట్లో నలుసు పెట్టుకొని మా కంట్లో దూలాలు వెతకటం సరికాదని వారు విమర్శించారు.

## సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వీలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మధిర మండలం కాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ మధిర నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అనే ఆయన పేర్కొన్నారు దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందినీ ఆయన అన్నారు పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 ను ఉప సవరించుకోవాలన్నారు రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉప సంఘం పచ్చ జెండా ఊపింది కొత్తగా కానీ ఆ తర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు ఐటీ పరిశ్రమలు శాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూనివర్సిటీని సాంకేతిక విద్యా శాఖ పరిధిలోకి




తెస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా ముందడుగు పడలేదు తాజాగా ఐటిఐలు ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాల ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ నిర్వహించింది దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతుందని ఇలాంటి నిర్ణయాలను వెనుక తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకులు భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్ ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని లేని ఎడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా ఏఐఎస్ఎఫ్ మధిర నియోజకవర్గ నాయకులు మణికంత పవన్ రితిక్ అశోకు సాయి వెంకట్ హుస్సేన్ మౌనిక శ్వేత రమ్య దివ్య కీర్తన తదితరులు పాల్గొన్నారు.



# మార్చాలలో ఘనంగా బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలు

### పాల్గొన్న ఎమ్మెల్యే నర్సిరెడ్డి నారాయణరెడ్డి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మండల పరిధిలోని మార్చాల గ్రామంలో శ్రీ శ్రీ బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల తరపున మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్చాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్వకుర్తి 100 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని, ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ దశల పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఆసుపత్రి నిర్మాణాన్ని ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట సమన్వయం చేసుకుంటూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు అత్యవసర, నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, సమయానికి మెరుగైన వైద్యం పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రద్దు కుట్రను అడ్డుకోవాలి

### ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ మహిళల ధర్నా




**ఎల్బీనగర్, క్రైమ్ మిర్రర్,ఆగస్ట్ 17:** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా నాయకులు నిరసన చేపట్టారు. సోమవారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద రోడ్డుపై ధర్నా నిర్వహించి ప్రభుత్వ తీరును నిరసించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ పేదింటి ఆడబిడ్డలకు భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి అంశంలో హైకోర్టులో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై వారు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన అవినీతి ఆరోపణల కేసుల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు న్యాయవాదులను నియమించే ప్రభుత్వం.. పేదల సంక్షేమ పథకానికి సంబంధించిన అంశంలో కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని నిలదీశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదని, పేద కుటుంబాల ఆడబిడ్డల ఆత్మగౌరవం, ఆర్థిక భరోసాతో ముడిపడిన పథకాలని మహిళలు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఆర్థిక భారంగా మారుతున్న విషయాన్ని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. రూ.51 వేలతో ప్రారంభమైన ఆర్థిక సహాయాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించామని వారు పేర్కొన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కళ్యాణలక్ష్మి ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయాల్సింది పోయి పథకాన్నే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని మహిళలు విమర్శించారు. తులం బంగారం హామీపై ఆడబిడ్డలు ప్రశ్నిస్తున్నందునే ఆ అంశం నుంచి తప్పించుకునేందుకు కళ్యాణలక్ష్మి పథకాన్ని ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన లబ్ధిదారులు కళ్యాణలక్ష్మి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలాకాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఆలస్యంగా ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన అన్ని దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని బీఆర్ఎస్ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాల తరఫున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాల్లు రంగేశ్వరి నాయుడు, పార్టీ సీనియర్ మహిళా నాయకులు శైలజ, రమాదేవి, దేవి, రాధిక, విజయలక్ష్మి, శ్రీలత, కల్పన, వసంత, లక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# జనగాం - వాచ్య తండ బి.టి. రోడ్డు పనులు ప్రారంభించిన:సర్పంచ్ లోడే రఘు గౌడ్



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 17(క్రైమ్ మిర్రర్):** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సంస్థాన్ నారాయణపురం మండల జనగాం గ్రామం నుండి వాచ్య తండ వరకు నిర్మించిన 3.5 కిలోమీటర్ల నూతన బి.టి. రోడ్డును జనగాం గ్రామ సర్పంచ్ లోడే రఘు గౌడ్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి చొరవతోనే ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమైందని, దీనివల్ల గ్రామ ప్రజలకు మరియు తండ ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరాయని తెలిపారు.. ఈ కార్యక్రమంలో వాచ్య తండ సర్పంచ్ వాకుడోత్ సుధాకర్ ,గ్రామశాఖ అధ్యక్షులు గడ్డం రవి, ఉపసర్పంచ్ ఎర్ర సుశీల లక్ష్మయ్య, సెక్రెటరీ కొర్ర కిషన్ ,వార్డు మెంబెర్ చుక్క అశోక్, మాజీ సర్పంచ్ గడ్డం శంకరయ్య, మాజీ గ్రామశాఖ అధ్యక్షులు గడ్డం యాదగిరి,మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ శంకరయ్య, మంచాల జంగయ్య,బిచ్చానాయక్, డిఎస్పి గ్రామ శాఖ అధ్యక్షులు గోసుకొండ చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు చుక్క సైదులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు..

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి(నాగర్ కర్నూల్):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను అధికారులు సత్వరం పరిష్కరించి, ఆ వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాలని సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.చెన్నయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ఎప్పటికప్పుడు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు పరిష్కరించిన అనంతరం ఆ సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలోకి రాని పక్షంలో దరఖాస్తును సంబంధిత శాఖకు లేఖ ద్వారా పంపించి, ఆ విషయాన్ని ఫిర్యాదుదారునికి తెలియజేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఏదైనా సమస్యను పరిష్కరించడం సాధ్యం కాకపోతే, ఆ విషయాన్ని స్పష్టంగా ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అంతేతప్ప దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచకూడదని స్పష్టం చేశారు.

# డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

**సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలి**

**అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు**

**ఓటర్లు తప్పనిసరిగా డ్రాఫ్ట్ జాబితాను పరిశీలించాలి**

**అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల**

**జిల్లా ఎన్నికల అధికారిడ కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సోమవారం విడుదల చేశారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 910 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హమైన లేదా నిబంధనలకు విరుద్ధంగా నమోదైన ఓటర్ల వివరాలను గుర్తించి సరిచేయడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకత, విశ్వసనీయతను పెంచే విధంగా సవరణ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సేకరించినట్లు, ప్రస్తుత ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందజేసి వివరాలను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్ఓలు సేకరించిన వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి, ఎన్యూమరేషన్ ఫారాలు, క్షేత్రస్థాయి పరిశీలన, అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను రూపొందించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రస్తుత ఓటర్ల వివరాలను 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను కూడా నిర్వహించినట్లు, కుటుంబ సంబంధాలు, చిరునామాలు, ఇతర సంబంధిత సమాచారాన్ని పరిశీలించి ప్రస్తుత వివరాలతో సరిపోల్చినట్లు కలెక్టర్ తెలిపారు. 2026 జూన్ 10 నాటికి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 880 పోలింగ్ కేంద్రాల్లో 7,31,632 మంది ఓటర్లు నమోదై ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణతో వాటి సంఖ్య 910కి పెరిగిందని, ఆగస్టు 17న విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,18,592 మంది ఓటర్లు ఉన్నట్లు, 3,11,395 మంది పురుష ఓటర్లు, 3,07,182 మంది మహిళా ఓటర్లు, 15 మంది ఇతరులు, 579 సర్వీస్ ఓటర్లు ఉన్నాయని తెలిపారు ఎస్ఐఆర్ సందర్భంగా 22,669 మంది ఓటర్లు మరణించినట్లు బీఎల్ఓల క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించి అధికారికంగా నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 18,260 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదని, మరో 20,396 మంది ఓటర్లు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు లేదా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఇతర అసెంబ్లీ నియోజకవర్గాలకు తమ ఓటు నమోదును మార్చుకున్నట్లు పరిశీలనలో వెల్లడైందని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై 2026 ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించిన అనంతరం 2026 అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని ప్రతి ఓటరూ తమ పేరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, పేరు మాత్రమే కాకుండా ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, వయస్సు, లింగం, చిరునామా తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో కూడా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. కుటుంబంలోని అర్హులైన ప్రతి సభ్యుడి పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అర్హత ఉన్నప్పటికీ పేరు లేకపోతే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వివరాల్లో తప్పులు ఉంటే నిర్ణీత విధానంలో సవరణకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పేరు డ్రాఫ్ట్ జాబితాలో లేని వారు నిర్ణీత గడువులోగా క్లెయిమ్ దాఖలు చేసుకోవాలని, జాబితాలోని ఏదైనా నమోదుపై అభ్యంతరం ఉన్న వారు నిబంధనల ప్రకారం అభ్యంతరం దాఖలు చేయవచ్చని, చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తులు సమర్పించాలని ప్రజలను కోరారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలోని ఏదైనా నమోదుపై అభ్యంతరం వచ్చినప్పుడు సంబంధిత వ్యక్తులకు ఎన్నికల నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమ అర్హతకు సంబంధించిన వివరాలు, అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. సమర్పించిన ఆధారాలను నిబంధనల ప్రకారం పరిశీలించిన అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల, క్లెయిమ్స్, అభ్యంతరాల గడువు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో లేకపోతే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా క్లెయిమ్ దాఖలు చేసేలా సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పక్షపాతం లేకుండా పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా చూడటంతో పాటు, ఓటర్ల జాబితా విశ్వసనీయతను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని కలెక్టర్ అన్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించిన అనంతరం తుది ఓటర్ల జాబితాను రూపొందిస్తామని జిల్లా ఎన్నికల అధికారిడ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన, భారతీయ జనతా పార్టీ తరపున నాగేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ తరపున, ఎండి హబీబ్, రాజేందర్, చింతల రాజ్ గోపాల్, వైయస్సార్సీపి నుండి ఎండి హుస్సేన్, టిడిపి పార్టీ నుండి డి బాలకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధిగా నరసింహ, విష్ణు, సిపిఎం పార్టీ తరఫున పర్వతాలు, అశోక్, తదితరులు ఉన్నారు.





## ఉచిత విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలి: గోపి రజక

**కొత్తకోట, ఆగస్టు 17(క్రైమ్ మిర్రర్):** రజక వృత్తిదారులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి వృత్తిదారులకు ఊరట కల్పించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షులు పేరూరి బాలస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పథకానికి సంబంధించిన విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో వృత్తిదారులపై వేల రూపాయల బిల్లులు పేరుకుపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో సోమవారం పట్టణ అధ్యక్షులు పేరూరి బాలస్వామి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి గోపి రజక , ఇటిక్యాల బండలయ్య ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఉచిత విద్యుత్ పథకం అమలులో ఏర్పడుతున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాసాల లక్ష్మయ్య మాట్లాడుతూ, ప్రజాసంక్షేమ ప్రభుత్వంలో రజక వృత్తిదారులు విద్యుత్ బిల్లుల విషయంలో తీవ్ర అయోమయానికి గురవుతున్నారని అన్నారు. బకాయిలు పెరిగిపోతుండటంతో భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోతే తమ ఆస్తులను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వస్తుందేమోనని వృత్తిదారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. . ఈ సమస్యను గతంలోనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. పట్టణ గౌరవ అధ్యక్షులు రాసాల లక్ష్మయ్య,భవాణి చంద్రయ్య ,బి.రవి , బి.శ్రీను ,బి.వెంకటేష్ రిటైర్డ్ ఆర్టీసీ,పేరూరి నాగరాజు,ఆర్ కురుమయ్య,కె.మహేష్ ,ఆర్. నాగరాజు,అప్పరాల శివయ్య తదితరులు పాల్గొన్నారు

## పథకాలను రద్దు చేయాలని చేసే కుట్ర ప్రభుత్వానికి తగదు

**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** హైకోర్టు సాకుతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయాలని కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంది అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పేరుమల్ల సతీష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చినాక ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడం చేత గాక గత పది సంవత్సరాలు కేసీఆర్ అమలు చేసిన పథకాలను కూడా తొలగించే కుట్రలు చేయడం చాలా సిగ్గుచేటు అని మండిపడ్డారు .హైకోర్టు కల్యాణ లక్ష్మి ,షాది ముబారక్ పై ప్రభుత్వ వాదనలు వినిపించడానికి నాలుగు వారాలు గడివిచ్చిన ఇప్పటి వరకు కూడా ఎటువంటి పిటిషన్ దాఖలు చేయకపోవడం వెనక కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచన విధానం తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరికీ అర్థమైందని త్వరలోనే కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేటందుకు తెలంగాణ ప్రజలు కంకణ బద్ధులై ఉన్నారని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో చెన్నబోయిన నరసింహ,హరి నాయక్ ,కొండల్ , భార్గవ్ ,వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు,రాజు,కృష్ణ, కాశయ్య ,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.